ముఖ్యమంత్రి కార్యాలయము

తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-2 18, అక్టోబరు, 2014

నీటి పారుదల ప్రాజెక్టులు, ఇతర అభివృద్ధి పనుల వల్ల నిర్వాసితులయ్యే గిరిజనులకు దేశంలో మరే రాష్ట్రం ఇవ్వనంత మంచి పునరావాస ప్యాకేజి అందివ్వనున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రకటించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన శనివారం గిరిజన సలహ మండలి సమావేశం సచివాలయంలో జరిగింది. నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, ప్రభుత్వ సలహాదారులు విద్యాసాగర్‌రావు, రామలక్ష్మణ్, యంపిలు కె.కేశవరావు, అజ్మీరా సీతారాంనాయక్, నగేష్, ఎమ్మెల్యేలు అజ్మీరా రేఖ, కోవా లక్ష్మి, రాథోడ్ బాబురావు, బానోతు శంకర్, అజ్మీరా చందులాల్, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, బానోతు మదన్‌లాల్, సున్నం రాజయ్య, రవీంద్రకుమార్ రామవత్, డిఎస్.రెడ్యానాయక్, తాటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ రాములునాయక్, అధికారులు ఎస్‌కె.జోషి, రాధ, సోమేష్‌కుమార్, శ్రీదేవి, సిఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు. ప్రాణహిత – చేవేళ్ల ప్రాజెక్టు కింద భూములు కోల్పోయే గిరిజనులకు అత్యుత్తమ ప్యాకేజి అందివ్వనున్నట్లు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వెల్లడించారు. గిరిజనులకు రిజిస్ట్రేషన్ విలువ కన్నా రెండింతలు ఎక్కువ నష్ట పరిహారం అందిస్తామని, ఈ ప్యాకేజి వల్ల లక్ష రూపాయల ఎకరం భూమి ఉంటే నాలుగు లక్షల పరిహారం అందుతుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇది పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్యాకేజి కన్నా ఎక్కువ అని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఇల్లు లాంటి ఇతర స్థిరాస్తులను లెక్కించే క్రమంలో కూడా నిబంధనలు సవరించి గిరిజనులకు ఎక్కువ న్యాయం చేయడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టు వివరాలను ముఖ్యమంత్రికి తెలియజేసిన అధికారులు, ఈ ప్రాజెక్టు కింద 7 రిజర్వాయర్లు ఉన్నాయని, 9 గ్రామాలు ముంపుకు గురయ్యే ప్రమాదముందని, 789 గిరిజన కుటుంబాలు నిర్వాసితులుంటారని, అందులో 93 కుటుంబాలు పూర్తిగా, 696 కుటుంబాలు పాక్షికంగా నిర్వాసితులు వుంటారని చెప్పారు. తనకున్న భూమిని పూర్తిగా కోల్పోయిన గిరిజనులను బాధితులుగా

భావించాలని, ప్రాజెక్టు కింద ఎవరెవరు భూములు కోల్పోతున్నారో వారి వివరాలను ముందుగానే నోటిఫై చేయాలని, గిరిజన ప్రజాప్రతినిధులకు కూడా వివరాలు అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రాణహిత – చేవేళ్ల ప్రాజెక్టుకు కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. గిరిజన తండాలు, ఆదివాసి గూడేలను గ్రామ పంచాయతీలుగా మార్చే విషయంలో కూడా చర్చ జరిగింది. మానిఫెస్టోలో ఇచ్చిన హామి మేరకు గిరిజన తండాలు, ఆదివాసి గూడేలను గ్రామ పంచాయతీలుగా మార్చడానికి తాము సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. దీనికి సంబంధించి విధి విధానాలు ఖరారు చేయాల్సి ఉందని, అందుకోసం గిరిజన ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ సూచనలు అందించాలని ముఖ్యమంత్రి కోరారు. గ్రామానికి మూడు కిలోమీటర్ల అవతల ఉన్న తండాలను కలుపుతూ ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేయాలని చాలా మంది ప్రజాప్రతినిధులు సూచించారు. 500 జనాభాకు ఒక గ్రామ పంచాయతి అనే నిబంధనకు కూడా కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని, దగ్గర ఉన్న రెండు మూడు తండాలను కలిపి ఒక గ్రామ పంచాయతి చేస్తే సరిపోతుందని వారు అన్నారు. అదే విధంగా 500 లోపు జనాభా ఉన్నప్పటికి మిగతా జనావాస ప్రాంతాలకు దూరంగా ఉన్న వాటిని కూడా ప్రత్యేక గ్రామపంచాయతీలు చేయాల్సేందనని కొందరు సూచించారు. మరో సారి ఎస్టీ ప్రజాప్రతినిధులతో సమావేశమై విధి విధానాలు ఖరారు చేస్తామని ముఖ్యమంత్రి హామినిచ్చారు. ఎస్టీలకు ఇచ్చే పునరావాస ప్యాకేజి విషయంలో కూడా ప్రజాప్రతినిధులు సూచనలు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. గిరిజన ప్రాంతాల్లో ఐటిడిఎలు, ఇతర విద్యా సంస్థలు ఉన్నప్పటికి విద్య పరంగా పెద్దగా పురోగతి రాకపోవడంపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజనుల్లో అక్షరాస్యతా శాతం ఎందుకు పెరగడం లేదు? గిరిజన ప్రాంతాల్లో విద్యా సంస్థల పరిస్థితి ఏమిటీ? ఖాలీలు ఎన్ని ఉన్నాయి తదితర విషయాలపై వెంటనే అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఖాలీలను వెంటనే భర్తీ చేయాలని చెప్పారు. రాష్ట్రంలోని ఎస్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల పరిస్థితిపై కూడా నివేదిక సమర్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నదని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుకోవడానికి గిరిజన పారిశ్రామిక వేత్తలు సిద్ధం కావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. డిక్కి తరహాలో

ఎస్టీ పారిశ్రామికవేత్తలు కూడా ట్రైబల్ ఇండస్ట్రియల్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

భూసేకరణ చట్టం ప్రకారం గిరిజనులకు ఇచ్చే పరిహారపు ప్యాకేజిని ఎక్కువ చేసినందుకు, గిరిజన తండాలు, ఆదివాసి గూడేలను గ్రామ పంచాయతీలుగా మర్చడానికి నిర్ణయం తీసుకున్నందుకు పార్టీలకు అతీతంగా ఎస్టీ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా కాంగ్రేస్‌కు చెందిన డోర్నకల్ ఎమ్మెల్యే డిఎస్.రెడ్యానాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి గిరిజనుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయాలు తీసుకున్నారని అభినందించారు. అనంతరం మిగతా ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా కృతజ్ఞతలు తెలిపారు. కళ్యాణ లక్ష్మి లాంటి వినూత్న కార్యక్రమాలు గిరిజనులకు ఎంతగానో ఉపయోగపడతాయని ఎమ్మెల్యేలు అన్నారు. గిరిజన తండాలకు, ఆదివాసి గూడేలకు రోడ్ల సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం తీసుకోవాలన్న ఎమ్మెల్యేల విజ్ఞప్తి పై కూడా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం